సాక్షి చిత్తూరు

శుక్రవారం । 10 । మార్చి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53.000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5.100
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65.000
రిటైల్ వెండి గ్రాము	రూ.67

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	18
తిరుపతి	34	18
తిరుమల	30	14
గూడూరు	34	21
నగరి	35	19



శరవే'గంగ' నిర్మాణం

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్ణీత సమయానికి ఆలయ పనులు పూర్తయ్యేలా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

న్యూస్‌రీల్

జిల్లాకు చేరిన ఇంటర్ పాఠ్య పుస్తకాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరాయి. రాష్ట్ర మోడల్ స్కూల్ కార్యాలయం నుంచి పుస్తకాలను సరఫరా చేశారు. జిల్లాలోని మోడల్ స్కూళ్లలో వచ్చే ఏడాది ఇంటర్మీడియట్ విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. జిల్లాకు చేరిన పుస్తకాలను ప్రత్యేకంగా గోడౌన్‌లో భద్రపరిచారు. ఈ కసరత్తును డీఈఓ విజయేంద్రరావు పర్యవేక్షించారు.

కన్స్యూమర్ గూడ్స్ విక్రయాలకు కసరత్తు

చిత్తూరు రూరల్: జిల్లాలో ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ విక్రయాలకు కసరత్తు ప్రారంభించామని డీఎస్‌ఓ శంకరన్ అన్నారు. చిత్తూరు నగరం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ విక్రయాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి మండలానికి ఒక ఎండీఎం ఆపరేటర్‌ను ఎంపిక చేసి, ఈ విధానాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో రూ.10 వేలు పెట్టుబడి పెట్టేవారిని ఎంపిక చేస్తున్నామని, వీరు మార్కెట్‌లో కొనుగోలు చేసే ధరల కంటే తక్కువకే నాణ్యత గల సరుకులు ఉండేలా చూస్తున్నట్లు తెలిపారు. ఈనెల 17 నుంచి ఎంపిక చేసిన ఎండీఎం ఆపరేటర్ల ద్వారా సరుకుల విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. 336 వాహనాలకు గానూ 31 వాహనాలు ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. త్వరలోనే అన్ని ప్రాంతాల్లో దీన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారిక యంత్రాంగం ఏర్పాట్లుచేసింది. ఇందుకు గాను కలెక్టరేట్‌లో జేసీ, డీఆర్‌వో చాంబర్లలో ప్రత్యేక సీల్డ్ బాక్సులను ఏర్పాటుచేశారు. ఓటు హక్కు ఉన్న సిబ్బంది, అధికారులు తమ ఓటు అందులో వేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఇదే విధంగా తిరుపతి, అన్నమయ్య, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కలెక్టరేట్లలో పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేశారు.

నేడు కౌంటింగ్‌పై శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌పై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.

డీటీసీకి జేటీసీగా పోస్టింగ్



బసిరెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు డీటీసీ బసిరెడ్డికి తిరుపతి జేటీసీగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఆయనకు జేటీసీగా ఉద్యోగోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి తిరుపతి జేటీసీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కాగా ఆయన త్వరలోనే జేటీసీగా బాధ్యతలను చేపడతారని, చిత్తూరు టీడీసీగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

జ్వరం.. వద్దు భయం

- తిరుపతి నగరంలోని ఎంఆర్‌పల్లి సర్కిల్‌లో నివాసముంటున్న భాను(పేరుమార్చాం)కు ఇటీవల తీవ్ర జ్వరం వచ్చింది. స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడి వైద్యులు రక్తపరీక్షలు చేసి వైరల్ ఫీవర్‌గా నిర్ధారించారు. మందులు, మాత్రలకు రూ.1,300 దాకా ఖర్చయింది. వారం రోజుల తర్వాత జ్వరం నయం కాగా దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లునొప్పులు అలానే ఉన్నాయి.
- చిత్తూరు మండలానికి చెందిన స్వప్న (పేరు మార్చాం) పది రోజుల క్రితం జ్వరంతో చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యింది. మూడు రోజుల పాటు డాక్టర్లు మెరుగైన చికిత్స అందించారు. కాస్త ఆరోగ్యం కుదటపడగానే డిశ్చార్జ్ చేశారు. ఇప్పుడు ఆ మహిళ కాస్త గొంతు నొప్పితో ఇబ్బంది పడుతోంది.

.. ఇవి రెండే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి కేసులు కోకొల్లలు. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతోపాటు నీటి కాలుష్యం, దోమల బెడద కారణంగా వైరల్ జ్వరాలు చుట్టుముడుతున్నాయి. రోజుల తరబడి తగ్గకపోవడంతో ఒకింత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రులకు క్యూకడుతున్నారు.



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో క్యూలో వేచి ఉన్న రోగులు

జిల్లాలో ఫ్లూ వైరస్ కంగారుపెడుతోంది. దగ్గు, జలుబు, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధుల్లో తీవ్రత అధికంగా కనిపిస్తోంది. ఆస్పత్రులకు జనం క్యూకడుతున్నారు. రోజూ 700లకు పైగా జ్వరాల కేసులు వస్తున్నాయి. ఇందుకు వాతావరణ పరిస్థితులు ఒక కారణమైతే.. మరో వైపు కొత్తరకం ఫ్లూ వైరస్‌గా వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫ్లూయిడ్స్ అధికంగా తీసుకోవడంతోపాటు వైద్యులను సంప్రదించకుండా ఇష్టానుసారం మందులు వాడొద్దని ఐసీఎంఆర్ సూచించింది.

- చిన్నారులు, వృద్ధుల్లో వైరస్ తీవ్రత
- కిక్కిరిస్తున్న ఆస్పత్రులు
- వారానికి పైగా తగ్గని దగ్గు, ఒళ్లు నొప్పులు
- అప్రమత్తమైన వైద్యఆరోగ్యశాఖ
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

సాక్షి, తిరుపతి/ చిత్తూరు రూరల్: జిల్లాకు జలుబు, దగ్గు, జ్వరం పట్టింది. ప్రస్తుతం ప్రతి ఐదుగురిలో ఒకరికి జ్వరం, దగ్గు, గొంతు నొప్పి లక్షణాలు కనిపిస్తున్నాయి. వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వేసవి మొదలైనా రాత్రి నుంచి ఉదయం వరకు చలి వణుకు పుట్టిస్తోంది. కుప్పం, వి.కో ట, పలమనేరు, పుంగనూరు, చిత్తూరు సరిహద్దు ప్రాంతాల్లో చలి తీవ్రత తగ్గడం లేదు. కనిష్ఠంగా 19 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఈ కారణంగా జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత వ్యాధులు పెరు గుతున్నాయి. దీనికి కొత్తరకం వైరస్ తోడైందని.. ఇన్ఫ్లుయెంజా-ఏ ఉపరకంలో హెచ్3 ఎన్ 2 వైరస్ కారణమని వైద్యులు అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక జిల్లా ఆస్పత్రి , మూడు ఏరియా ఆస్పత్రులు, 7 సీహెచ్‌సీలు, 50 పీహెచ్‌సీలు ఉన్నాయి. 2 వేలకు పైగా ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా.. వీటి పరిధిలో రోజూ దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత కేసులు 700 వరకు వస్తున్నాయి. ఈ కేసులను పరీక్షించగా సీజనల్ ప్రభావంతో పాటు ఫ్లూ వ్యాప్తి చెందుతున్నట్లు వైద్యులు నిర్ధారిస్తున్నారు. వైరల్ ఫీవర్ బాధిత రోగులతో ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. చిన్నపిల్లలకు సంబంధించిన ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతు న్నాయి. చాలా మందిలో అవి తీవ్రంగా... ఉంటున్నాయి. కొందరిలో కొన్ని రోజుల తరువాత న్యు మోనియాగా మారి శ్వాసకోశ ఇబ్బందులకు గురిచేస్తోంది.




చికిత్స చేస్తున్న డాక్టర్లు

జాగ్రత్తలు ఇలా..

- ఫ్లూ లక్షణాలు ఉన్నవాళ్లు ఇతరులతో కరచాలనం, ఆలింగనం, దగ్గరగా కూర్చోవడం, కలిసి భోజనం చేయకూడదు
- లక్షణాలున్న వాళ్లు బహిరంగ ప్రదేశాలలో ఉమ్మి వేయకూడదు
- సొంత వైద్యం వీడి వైద్యుడి సూచనల మేరకు మందులు వాడాలి
- బహిరంగ ప్రదేశాల్లో, సమూహాల్లో ఉన్నప్పుడు విధిగా మాస్కులు ధరించాలి
- తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి
- నోరు, ముక్కును పదే పదే తాకరాదు
- దగ్గుతున్నప్పుడు, ముక్కు కారుతున్నప్పుడు గుడ్డను ఉపయోగించాలి
- వ్యాధి నిరోధక శక్తి పెంచే ఆహారం తీసుకోవాలి

లక్షణాలు..

ఫ్లూ వైరస్ బారినపడుతున్న వారిలో ఎక్కువగా తీవ్రమైన దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, కొందరిలో అధిక జ్వరం వస్తోంది. మరికొందరిలో తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్యలకు ఈ వైరస్ కారణమవుతోంది. వైద్యుల వద్దకు వెళ్లినా, మందులు వాడుతున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదంటున్నారు. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీఎంఆర్ సూచించింది. ఫ్లూయిడ్స్ అధికంగా తీసుకోవడంతోపాటు వైద్యులను సంప్రదించకుండా ఇష్టానుసారం మందులు వాడొద్దని సూచించింది. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్లాత్ అడ్డంగా పెట్టుకోవాలని, లక్షణాలు ఉన్నవారు పిల్లలు, వృద్ధులకు దూరంగా ఉండాలని పేర్కొంది. జ్వరం, ఒళ్లు నొప్పులకు పారాసిట్మాల్ వినియోగించాలని, ఇబ్బంది ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించింది. చిన్నారుల్లో ఈ సమస్య కొంత ఎక్కువగా కనిపిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఫ్లూ ఇన్ఫెక్షన్ సాధారణంగా వారం నుంచి పది రోజులు ఉంటుంది. దగ్గు మూడు వారాల వరకు ఉంటుంది. 15 ఏళ్ల లోపు పిల్లలు, 50 ఏళ్ల పైబడిన వారు ఈ ఇన్ఫెక్షన్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. వాయు కాలుష్యం కూడా కేసుల పెరుగుదలకు కారణమవుతోందని వైద్యులు చెబుతున్నారు. అయితే వ్యాధితీవ్రత ఎక్కువగా ఉన్నా భయపడాల్సిన పనిలేదని అంటున్నారు.



ఫీవర్ వివరాలు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులు	158
ప్రవేటు ఆస్పత్రులు	482
ఆర్ఎంపీ క్లినిక్‌లు	2 వేలకు పైనే

తిరుపతి జిల్లాలో..

తేదీ	జ్వరాల సంఖ్య
2	781
3	704
4	644
5	738
6	566
7	761

చిత్తూరు జిల్లాలో..

తేదీ	జ్వరాల సంఖ్య
2	675
3	524
4	581
5	613
6	691
7	571

అప్రమత్తంగా ఉండాలి



జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లునొప్పులు తదితర కేసులు అధికంగా వస్తున్నాయి. వైరస్ వ్యాప్తి అధికంగా ఉంది. ఇలాంటి సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ వైరస్ న్యుమోనియా బారినపడేలా చేస్తోంది. భయపడాల్సిన పనిలేదు. బయటకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించాలి. పౌష్టికాహారం ఆహారం తీసుకోవాలి. చల్లని పానీయాలు, బయటి ఆహారాలకు కొంత దూరం ఉండాలి. – రవిరాజు, డీఐఓ

యాంటీ బయాటిక్స్ వాడొద్దు



ఫ్లూ జ్వరాలకు భయపడాల్సిన అవసరం లేదు. వైద్యులను సంప్రదించి తగిన మాత్రలు, మందులు వాడాలి. వారం నుంచి పదిరోజుల లోపు లక్షణాలు తగ్గుతాయి. జ్వరం తగ్గ లేదని మెడికల్ షాపులను ఆశ్రయించవద్దు. తొందరగా జ్వరం తగ్గుతుందని.. యాంటీ బయాటిక్స్ వాడకూడదు. మరోవైపు ఇన్‌ఫెక్షన్‌లను నిర్ధారించుకోకుండా రోగులకు యాంటీ బయాటిక్స్ సూచించకూడదని ఐసీఎంఆర్ హెచ్చరించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. – బీఎస్‌కే నాయక్, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

పేర్నాటిని భారీ మెజారిటీతో గెలిపించండి



పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా కృషి చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండల పరిధిలోని పూణెపల్లి ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల కార్యక్రమంలో ఉద్దేశించి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి పట్టభద్రులు అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటిని భారీ మెజారిటీతో గెలిపించడానికి పార్టీ నాయకులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. అనంతరం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పెనుమూరు హైస్కూల్, జూనియర్ కళాశాల, శాతంబాకం, ఉగ్రాణపల్లి తదితర స్కూళ్లలో, సచివాలయాల్లోని పట్టభద్రులను కలసి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, జిల్లా యువత ప్రధాన కార్యదర్శి విజయకుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూది మోహన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాము, నవీన్‌కుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, యతీశ్వర్‌నాయుడు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామిక విప్లవానికి నాంది

- జగనన్న బ్రాండ్ ఇమేజ్‌తోనే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ విజయవంతం
- పర్యాటక రంగంలో రూ.21,941 కోట్ల పెట్టుబడులు
- కామెంట్ చేసిన వారికి ఈ పెట్టుబడులే సమాధానం..
- నేత ఉత్పత్తిదారుల సమావేశంలో మంత్రి ఆర్‌కే రోజా



నేత ఉత్పత్తిదారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి: విశాఖపట్నంలో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడం రాష్ట్ర పారిశ్రామిక విప్లవానికి నాంది అని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు, చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం నగరి మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పంలో నేత ఉత్పత్తిదారులతో ఆమె సమావేశమయ్యారు. నేత రంగంలో నెలకొంటున్న మార్పులపై చర్చించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామికంగా రాష్ట్రం ముందడుగు వేస్తోందన్నారు. సీఎం జగనన్న బ్రాండ్ ఇమేజ్ వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు ప్రవాహంలా వస్తున్నాయన్నారు. పర్యాటక రంగానికి రూ.21,941 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి 129 ఎంఓయూలు చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం 41,500 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్, కర్ణాటకల్లో జరిగిన పెట్టుబడుల సదస్సుల్లో కూడా పర్యాటక రంగానికి సంబంధించి ఇంత భారీస్థాయిలో పెట్టుబడులు రాలేదన్నారు. సీఎం జగనన్న విజన్ ఏంటో ఇప్పుడు అందరికీ అర్థమైందన్నారు. 6 లక్షల మందికి ఉద్యోగాలు రావడం చిన్న విషయం కాదన్నారు. ప్రతిపక్షాలు చేసే దిగజారుడు రాజకీయాలు పక్కన పెట్టి పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారన్నారు.

వారికి ఈ పెట్టుబడులే సమాధానం..

రోజమ్మ టూరిజం మినిస్టరా ? టూరిస్టా అని ఎగతాళి చేసిన వారికి పర్యాటక రంగానికి వచ్చే రూ.21,941 కోట్ల పెట్టుబడులే సమాధానం అన్నారు. పిచ్చుకలంక, గండికోట, తిరుపతి, హార్సిలీహిల్స్, విశాఖపట్నంలో టూరిజం అభివృద్ధికి రూ.1,350 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. తూర్పు గోదావరిలో రూ.వెయ్యి కోట్ల వ్యయంతో డెస్టినేషన్ టూరిజం ప్రాజెక్ట్ ఏర్పాటు కానుందని తెలిపారు. విజయవాడలో భవానీ ఐలాండ్‌కు, ఈగలపెంట నుంచి శ్రీశైలానికి, కోట్టప్పకొండలో ఇప్పుడున్న ఆలయం నుంచి స్వయంభు ఆలయానికి, శ్రీకాళహస్తిలో రోప్‌వేలు వేయనున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలో బీచ్ పాయింట్‌లో రిషికొండ బీచ్ వరకు రూ.1,250 కోట్లతో, విశాఖలో వెయ్యి కోట్లతో గోల్ఫ్‌హౌస్, విల్లాస్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. అలాగే రూ.1000 కోట్లతో సఫారీ టూరిజం ప్రాజెక్టు రానుందన్నారు. తిరుపతి, బాపట్ల, విశాఖపట్నంలో రూ.1000 కోట్లతో 7 స్టార్ హోటళ్ల నిర్మాణానికి ఎంఓయూలు సిద్ధమయ్యాయని చెప్పారు. ఏడాదిలోపు వీటిని పూర్తి చేసి జగనన్న విశ్వసనీయత ఏంటో తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, చిత్తూరు జిల్లా నేత అనుబంధ సంఘం అధ్యక్షుడు కన్నాయిరం, నగరి మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, పురుషోత్తం, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి

- ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ
- పీఓ, ఏపీఓలకు జేసీ వెంకటేశ్వర్ పలు సూచనలు



ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించే పీఓ, ఏపీఓలు విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జేసీ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఓ, ఏపీఓలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్న వారికి రెండోసారి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మార్చి 13న ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఈ నెల 12వ తేదీ ఉదయం 7 గంటల కల్లా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఇవ్వడం జరుగుతుందన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆయా డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. 12వ తేదీన డివిజన్ కేంద్రాలకు పీఓలు, ఏపీఓలు, ఓపీఓ చేరుకుని మెటీరియల్‌లో చెక్ లిస్టు ప్రకారం (బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీల్, రెండురకాల బ్యాలెట్ పేపర్లు, ఎలక్ట్రోరల్ రోల్స్ మొదలగునవి) ఉన్నాయా ? లేవా అని సరి చూసుకోవాలన్నారు.

కేంద్రాలకు బృందంగా వెళ్లాలి..

పీఓ, ఏపీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్ అంతా ఒక బృందంగా ఉండి వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు ఈ నెల 12వ తేదీ సాయంత్రంలోపు చేరుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలను అనుసంధానం చేశామని, వీరితో సమన్వయం చేసుకోవాలన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల సంఘం ఇచ్చిన హ్యాండ్ బుక్‌లోని అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని చెప్పారు.

ఏజెంట్లకు పకడ్బందీగా పాస్‌ల పంపిణీ..

ఈనెల 13న ఉదయం 7 గంటల్లోపు ఏజెంట్లకు పాస్‌లు, సీటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. ఉదయం 8 గంటలకు కచ్చితంగా పోలింగ్ ప్రారంభమయ్యేలా ప్రిసైడింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ నిర్వహణలో పోలైన ఓట్లు శాతాన్ని ప్రతిగంటకు ఒకసారి నివేదిక కచ్చితంగా అందజేయాలన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీల్ చేసి సంతకాలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ డివిజన్ రిసెప్షన్ సెంటర్ స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్స్‌లను బందోబస్తు నడుమ చేర్చాలన్నారు. అలాగే పీఓ డైరీ ఇతర ప్రొఫార్మాలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం ఆర్డీఓ రేణుక, సృజన, శివయ్య, పీఓలు, ఏపీఓలు, పోలింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

– రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ వెల్లడించారు. ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం రాష్ట్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ రిటర్నింగ్ అధికారులతో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఆరు జిల్లాల డీఆర్‌ఓలు, ఆర్డీఓలతో సమన్వయం చేసుకుని పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పోలింగ్ నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు, మైక్రో అబ్జర్వర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, ఈనెల 11న మరోసారి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ మెటీరియల్‌ను జిల్లాలోని 4 రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పంకు పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. బ్యాలెట్ బాక్సుల ప్రిపరేషన్‌లో 287 బ్యాలెట్ బాక్సులను డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో అందుబాటులో పెట్టినట్లు తెలిపారు. 100 పోలింగ్ కేంద్రాల్లో (69 పట్టభద్రులు పోలింగ్ కేంద్రాలు, 31 ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రాలు) వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 16న చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు విధులు నిర్వర్తించేందుకు 195 మంది సూపర్‌వైజర్లు, 585 అసిస్టెంట్లు మొత్తం 780 మందిని గుర్తించామని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ హత్య కేసు 13కు వాయిదా

చిత్తూరు అర్బన్: చిత్తూరు మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ జంట హత్యల కేసు విచారణను ఈనెల 13వ తేదీకి వాయిదా వేస్తూ చిత్తూరులోని ప్రత్యేక మహిళా కోర్టు ఆదేశాలు జారీచేసింది. 2015లో జరిగిన ఈ ఘటనలో.. ఇప్పటికే విచారణ ప్రారంభించిన న్యాయస్థానం పలువురు సాక్ష్యుల వాంగ్మూలాన్ని నమోదు చేస్తోంది. గురువారం నిందితులు కోర్టు ఎదుట హాజరవగా, విచారణను వాయిదా వేస్తూ న్యాయమూర్తి శాంతి ఆదేశాలు జారీ చేశారు.

చెక్ బౌన్స్ కేసులో ఆర్నెళ్ల జైలు

చిత్తూరు అర్బన్: తీసుకున్న అప్పునకు చెల్లని చెక్కు ఇచ్చిన హరీష్ రెడ్డి అనే వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ చిత్తూరులోని ప్రత్యేక ఎక్సైజ్ కోర్టు గురువారం తీర్పునిచ్చింది. బెంగళూరుకు చెందిన హరీష్‌రెడ్డి వ్యాపారం కోసం 2011లో పుంగనూరులోని శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ నుంచి రూ.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీన్ని చెల్లించే క్రమంలో 2016లో రూ.1.03 కోట్లకు చెక్కును ఫైనాన్స్ సంస్థకు ఇచ్చాడు. చెక్కును బ్యాంకులో అందజేయగా.. అంత నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కేసు రుజువు కావడంతో నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ రవి తీర్పునిచ్చారు.

మంచి ఫలితాలు సాధించండి

- రాష్ట్రప్రభుత్వం స్కూళ్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పలమనేరు: కొలమాసనపల్లి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: రాష్ట్రప్రభుత్వం స్కూళ్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న తరుణంలో పదోతరగతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా ఆయన స్థానిక ఎంఈఓ లీలారాణితో కలసి మండలంలోని పలు స్కూళ్లలో తనిఖీ చేశారు. పదో తరగతి పిల్లలకు ధైర్యం చెప్పి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులను సాధించాలని సూచించారు. స్కూళ్లలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. నాడు–నేడు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సంబంధిత హెచ్‌ఎంలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు మనబడి ద్వారా ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్‌లను తలదన్నేలా తయారు చేసిందన్నారు. అనంతరం పట్టణ సమీపంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. ఏవైనా సమస్యలున్నాయా అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, మాజీ కన్వీనర్ మండీసుధా, నాయకులు చెంగారెడ్డి, రాజారెడ్డి, ఈశ్వర్ రెడ్డితో పాటు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లను బైండోవర్ చేయండి

- ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగాలి
- పోలీసు అధికారులతో ఎస్పీ రిషాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా జరగాలని చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం చిత్తూరు నగరంలోని పోలీసు అతిథిగృహంలో జిల్లాలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రౌడీషీటర్లను బైండోవర్ చేసుకోవాలన్నారు. ఓటర్లు ప్రశాంతంగా పోలింగ్‌లో పాల్గొనేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 33 పోలింగ్ కేంద్రాలు 16 సమస్యాత్మకంగా ఉన్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి డబ్బులు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం నియంత్రించడానికి సరిహద్దుల్లో నిఘా వ్యవస్థను పెంచాలని, బ్యాలెట్ పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భారీ భద్రత ఉంచాలని సూచించారు. ఓటర్లు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే డయల్–100, పోలీసు వాట్సాప్ 9440900005 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, బాబు ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, పలువురు సీఐలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యవృద్ధి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్: నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వాడాలని డీఆర్‌ఓ రాజశేఖర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమం, విద్యా, సర్వశిక్ష అభియాన్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్, గ్రామీణ అభివృద్ధి, జిల్లా గ్రామీణ నీటి పారుదలశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు (నేషనల్ డి–వార్మింగ్ డే) జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని 1–19 ఏళ్లలోపు అంగన్‌వాడీ కేంద్రం, స్కూళ్లు, కళాశాలల్లో వివిధ రకాల వసతి గృహాల్లో, బడిబయట పిల్లలందరికీ అందించాలన్నారు. పిల్లలను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలనే మంచి ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని డీఆర్‌ఓ రాజశేఖర్ వెల్లడించారు. టిఫిన్, భోజనం తిన్న తర్వాతనే ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. ఆరోగ్యం బాగ లేనివారు (జ్వరం ఉన్నవారు ఈ మాత్రలు వేసుకోకూడదని) వెల్లడించారు. మెడికల్ అధికారులు, ఎంఈఓలు సమన్వయం చేసుకుని మాత్రలు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు, మండల పరిధిలోని ఎంఈఓలు, సీడీపీఓలు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ సుదర్శనం, రవి రాజు, శ్రీనివాసులు, డీఈఓ విజయేంద్రరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం నమ్మకాన్ని నిలబెట్టుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

కుప్పంరూరల్: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనపై నమ్మకంతో పోటీలో ఉంచారని, ఆయనను గెలిపించి సీఎం నమ్మకాన్ని మనం నిలబెట్టుకోవాలని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. గురువారం ఆయన మున్సిపల్ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ఎక్కువ ఓట్లు కుప్పం పట్టణంలోనే ఉన్నందున కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. టీడీపీ డబ్బులు, మాయమాటలు చెప్పే పనిలో నిమగ్నమైందని, దీన్ని ధీటుగా ఎదుర్కొని ఎక్కువ ఓట్లు పేర్నాటికి పడేలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కుప్పం ఎన్నికల పరిశీలకులు రెడ్డెప్ప, రెస్కో చైర్మన్ సెందీల్, మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్, వైస్ చైర్మన్ మునస్వామి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల అదృశ్యం

నదుం: స్థానిక మహాత్మా జ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు అదృశ్యం అయ్యారు. గురువారం ఉదయం హాజరు సమయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఢిల్లీకుమార్(నంజంపేట), జగన్(పోతంవారిపల్లె) పాఠశాలలో లేనట్టు సిబ్బంది గుర్తించారు. వారు ఇళ్లకు కూడా వెళ్లలేదని నిర్ధారించిన తరువాత స్కూల్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మారుతి తెలిపారు.

వైద్య విద్యలో నైపుణ్యాల పెంపు తప్పనిసరి



పీఈఎస్‌లో శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎండీ రూప కృష్ణమూర్తి

గుడుపల్లె: నేషనల్ మెడికల్ కమిషన్ మార్గదర్శకాలతో నిర్వహించిన శిక్షణ ద్వారా వైద్య విద్యలో నైపుణ్యం పెంచుకోవాలని పీఈఎస్ కళాశాల మెడికల్ డైరెక్టర్ రూప సురేష్ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం పీఈఎస్ కళాశాలలో మెడికల్ కళాశాల అధ్యాపకులకు వైద్య విద్యావిధానంపై 3 రోజుల వర్క్‌షాపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వైద్య విద్యలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నైపుణ్యాల గురించి తెలియజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బుక్‌లెట్లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారావు, డాక్టర్ సురేష్, చిత్రనాగరాజు, నగేష్, ప్రదీప్, సుజాత పాల్గొన్నారు.